క్లుప్తంగా

ఘనంగా సింహాద్రప్పన్న సంబరాలు



తప్పెటగుళ్ల నృత్యాలతో అలరిస్తున్న కళాకారులు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో సింహాద్రప్పన్న (లక్ష్మీనృసింహస్వామి) సంబరాలు రెండో రోజు శనివారం ఘనంగా జరిగాయి. చుక్కల కుటుంబీకుల ఇళ్లల్లో కొలుస్తున్న సింహాద్రప్పన్న సంబరాలు ఆదివారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల నృత్యాలు, చెక్క భజనలు అలరించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు రూరల్: మండలంలోని పురోహితుని వలస ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అంజలీ దేవి తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈ నెల 28 నుంచి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు.

పన్ను చెల్లించండి..



ఇంటి పన్ను రశీదు తీసుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ : ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు అన్నారు. ఇంటి పన్నుల చెల్లింపుపై ప్రభుత్వం వడ్డీ రాయితీ అవకావం కల్పించిందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఇంటి పన్ను రూ. 1.25 లక్షలు చెల్లించి, రశీదు పొందారు.

సేవలతోనే గుర్తింపు



బుచ్చయ్యను సన్మానిస్తున్న పలు సంఘాల నాయకులు

పాలకొండ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీగా పనిచేసి పదవీవిరమణ పొందిన బొమ్మలాట బుచ్చయ్యను రెవెన్యూ, ఎన్‌జీఓ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, 30 ఏళ్ల సర్వీస్‌లో బుచ్చయ్య ఒక్క రిమార్క్ లేకుండా పని చేశారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, ఎన్‌జీఓ, రెవెన్యూ, సర్వేయర్ల, వీఆర్వోల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా మారిన పాలకొండ - సీతంపేట రహదారి

పాలకొండ రూరల్: రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులున్నాయి. శనివారం ఉదయం 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు వడగాడ్పులు వీయడంతో నిత్యం రద్దీగా ఉండే పాలకొండ-శ్రీకాకుళం, సీతంపేట రహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి.

ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యం

పాలకొండ రూరల్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. మండలంలోని గొట్ట మంగళాపురంలో ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు కదలండి

- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు పిలుపు
- వైఎస్సార్‌సీపీకి పార్వతీపురం కంచుకోట



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

పార్వతీపురం: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని పార్వతీపురం మన్యం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం రెండోసారి ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు టికెట్ కేటాయించిందన్నారు. 2019లో జరిగిన ఎన్నికలలో సాధించిన 24 వేల ఓట్లు మెజార్టీ కంటే అధికంగా సాధించేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమ పాలన, ప్రజల మద్దతుతో పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేయాలన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి అంకితభావంతో పని చేసిన టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పార్టీ టికెట్ ఆశించినప్పటికీ పలు సమీకరణాలు కారణంగా దక్కకపోయినప్పటికీ ఇప్పుడున్న స్థానం కంటే సముచిత స్థానం కల్పించేందుకు పార్టీ అధిష్టానం కట్టుబడి వుందన్నారు. అందరూ సమష్టిగా పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ పార్వతీపురంలో రెండోసారి విజయానికి తన వంతు కృషి చేస్తానని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. అధినాయకత్వం అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడం జరుగుతుందన్నారు. ప్రతిపక్షంలో వున్నప్పుడు ఎన్నో పోరాటాలు చేసి ఇబ్బందులు ఎదుర్కొని పార్టీ విజయానికి అలుపెరగని కృషి చేశానన్నారు. 2019లో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీని ఈ ఎన్నికలలో సాధించేందుకు కార్యకర్తలందరినీ కలుపుకొని సమన్వయంతో పని చేస్తామని ప్రకటించారు.

కార్యకర్తలను గెలవాలి

పార్వతీపురం నియోజకవర్గాన్ని టీడీపీ గెలవాంటే ముందు మూలస్థంభాలుగా వున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను గెలవాలనే విషయాన్ని ఆ పార్టీ గమనించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. ఒకే మాట, ఒకే ఆలోచనతో కార్యకర్తలను, నాయకులను కలుపుకొని పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకుడు తూముల భాస్కరరావు, పార్వతీపురం మున్సిపల్ చైర్మన్ బోను గౌరీశ్వరీతో పాటు పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల కన్వీనర్‌లు, జెడ్పీటీసీలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలులో ఒక విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదపదం పంచాయతీలో ఆయన గడప గడపలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో అడుగుపెట్టిన వెంటనే అక్కడ ప్రజలు పూలమాలతో స్వాగతం పలికారు. గ్రామంలో మహిళలు ఆయనకు హారతులు పట్టి దీవించారు. ఈ సందర్భంగా రాజన్నదొర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నను అంతా కలిసి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి నేతలు కుట్రలు పన్నుతూ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మాట మీద నిలబడని ప్రతిపక్షాలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటా జగనన్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. పేదల పక్షాన నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అంతా అండగా నిలవాలన్నారు. సర్పంచ్ రెడ్డి సుకన్య ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మజ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



పదవీ విరమణ చేసిన లక్ష్మీపద్మలత దంపతులను సన్మానిస్తున్న పీఆర్ ఎస్ఈ మూర్తి తదితరులు

పార్వతీపురం: ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ వీఎస్ఎన్.మూర్తి అన్నారు. పీఆర్ కార్యాలయంలో ఉప కార్యనిర్వాహక ఇంజినీర్‌గా బాధ్యతలను నిర్వహించి శనివారం పదవీ విరమణ చేసిన కొటికలపూడి లక్ష్మీపద్మలత పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని లక్ష్మీపద్మలత పాటించారన్నారు. సీఆర్ ఈఈ డా.ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ విధి నిర్వాహణలో మిగిలిన సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. లక్ష్మీపద్మలత మాట్లాడుతూ విధి నిర్వాహణలో సహాయ సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా మావుడి



మావుడి శ్రీనివాసరావు

మక్కువ: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులుగా మక్కువ మండలం జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మావుడి శ్రీనివాసరావును నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకటచిన అప్పలనాయుడు గెలుపునకు నా వంతు కృషి చేస్తానన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని దీవించండి



ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని దీవించి రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. నారాయణపురంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందించామని, అందరికి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. దీన్ని గుర్తించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని దీవించి రెండోసారి గెలిపించాలని ఆయన కోరారు. అవ్వా తాతలను, యువతను, మహిళలను నేరుగా కలిసి వారికి సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను, యువతకు ఉపాధి మార్గాలపై ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను వివరించారు. రైతులకు ప్రభుత్వం అందించిన సేవలను వివరించారు. బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వంగా గుర్తింపు పొందిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అందరం రుణపడి ఉన్నామని దానిని తీర్చుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా, సంక్షేమ పథకాలను ఇంతవరకు ఏ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అందించలేదని, ఆ ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎం.శ్రీనివాసరావు, డి.అప్పలనాయుడు, సన్నిబాబు, కె.కృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కె.మోహనరావు, విజయ, ఎన్.పాపారావు, ఎ.సుందరరావు, ఎంపీటీసీ జి.మురళి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

పార్వతీపురం/పార్వతీపురం టౌన్: సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయానికి గృహసారథులు కృషి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని నర్శిపురం గ్రామంలో గృహసారథులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడచిన 58 నెలల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలన్నారు. ప్రత్యర్థి పార్టీల ఎత్తులను చిత్తు చేసేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు మనమంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు, పీఏసీఎస్ చైర్మన్ టి.శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

వైకల్య నిర్ధారణ పరీక్షలు



భవిత కేంద్రంలో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల 3 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సుగల వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు శనివారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి-2 కురి టి సోంబాబు, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా కోఆర్డినేటర్ పి.భానుమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన 85 మందికి వైద్యులు పరీక్షలు చేపట్టారు. వీరిలో 10 మందికి వినికిడి యంత్రాలు, 22 మందికి వీల్‌చైర్స్, 8 మందికి రోలేటర్స్ (నడక నేర్చుకునే యంత్రాలు) అందించాల్సి ఉందని నివేదికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన అందించే ఉపాధ్యాయులు ఐ.గంగాధర్, కె.గెద్దయ్య, ఎం.అరుణకుమారి, కె.సత్యనారాయణ, కె.చక్రధర్, ఆర్.రాంబాబుతో పాటు పిల్లల తల్లితండ్రులు, సంరక్షకులు పాల్గొన్నారు.

నిబంధనలు అమలు చేయాల్సిందే..

పాలకొండ రూరల్ : ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని నోడల్ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎరకారాయపురం, చిన్న మంగళాపురం, గొట్ట మంగళాపురం, తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు. పల్లెల్లో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై నిఘా పెట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. అనంతరం గొయిదాపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు.

జగనన్నను గెలిపించడానికి మేము సిద్ధం



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు

సీతానగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అందరం సమాయత్తం కావాలని జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గుచ్చిమిలో సర్పంచ్ మర్రాపు శ్రీదేవి నివాసంలో మండల స్థాయి పార్టీ నాయకులు సమావేశం శనివారం జరిగింది. ముందుగా గ్రామంలోని నియమించిన బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులతో సార్వత్రిక ఎన్నికల్లో ఇంటింటా ప్రచారం చేయాలని నాయకులు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచనల మేరకు జగనన్నను ముఖ్యమంత్రిని చేయడానికి క్షేత్ర స్థాయి నుండే పార్టీని బలోపేతం చేసేందుకు అందరం సమాయత్తమై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సచివాలయ కన్వీనర్లు మన్మధరావు, అప్పలనాయుడు, బి.శంకరరావు, ధనంజయనాయుడు, ఉప సర్పంచ్ ఆర్‌వీ రమణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ పెద్దింటి లక్షున్నాయుడు, ఆర్వీ పార్థసారధి, గోపాల్, పి.ఈశ్వర నారాయణ, రెడ్డి వెంకునాయుడు, బూత్ కమిటీ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో 8వ వార్డు

- రూ.కోట్లతో ముమ్మరంగా అభివృద్ధి పనులు
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర కృషితోనే..

సాలూరు:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మున్సిపాలిటీ 8వ వార్డును పరిశీలిస్తే ఈ వార్డులో కొంకివీధి, రెడ్డిక వీధి డౌన్, సంగీత పాఠశాల రోడ్డు కొంత భాగం వస్తున్నాయి. సుమారు రూ.53 లక్షల అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. మున్సిపాలిటీలో 14, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర లక్షల రూపాయిలతో పనులు జరిగాయి. వార్డులో 80 మందికి టిడ్కో ఇళ్లు, చంద్రంపేట, నెలిపర్తిలో 120 మందికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వార్డులో స్థలాలున్న 20 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. సుమారు 1450 మంది జనాభా ఉన్న ఈ వార్డులో సుమారు 1250 మంది ఓటర్లు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ సంక్షేమ పథకాలు ద్వారా సుమారు రూ.10కోట్ల ఈ వార్డులో లబ్ధిదారులకు డీబీటీ ద్వారా అందించారు.



8వ వార్డులో నిర్మించిన పైలట్ వాటర్ ట్యాంక్



నాడు నేడు పనులు చేపట్టిన మెట్టు వీధి ఉర్దూ పాఠశాల



8వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు

వార్డులో చేపట్టిన పనుల వివరాలు..

- కొంకివీధి కల్యాణ మండపం నుండి వేంకటేశ్వర స్వామి ఆలయం జంక్షన్ రోడ్డు వరకు సుమారు రూ.3 లక్షలతో 14వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ డ్రైన్ నిర్మాణం.
- సరస్వతి నిలయం నుండి వేంకటేశ్వర ఆలయం వరకు సుమారు 4లక్షల 50 వేల రుపాయిలతో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీరోడ్డు నిర్మాణం.
- కొంకివీధి చౌట్రీ నుండి సూరిబాబు పాన్ షాప్ వరకు సుమారు రూ.3 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం.
- పట్నాన దుర్గ ఇంటి నుండి రావిచెట్టు డౌన్ వరకు సుమారు రూ.3 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం.
- స్థానిక మెట్టు వీధి ఉర్దూ పాఠశాలను సుమారు రూ.15.86 లక్షలతో నాడు నేడు ద్వారా పనులు చేపట్టారు.
- కొంకి వీధిలో సుమారు లక్షా 50 వేల రుపాయిలతో పైలెట్ వాటర్ స్కీం నిర్మాణం.

ఇవే కాక మరెన్నో సీసీ రోడ్లు, డ్రైనేజిలు తదితర అభివృద్ధి పనులు ఈ వార్డులో మంజూరై వివిధ దశలలో ఉన్నాయి.

ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర చొరవతోనే...



ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ప్రత్యేక కృషితో వార్డులో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు సుమారు 10 కోట్ల రుపాయిలు అందించాం. వార్డులో 14, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర నిధులతో కొన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసాం. మరిన్ని అభివృద్ధి పనులు వివిధ దశలలో ఉన్నాయి. అందరి సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాం. వార్డులో సంక్షేమ, అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– జర్జాపు దీప్తి, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్, 8వ వార్డు కౌన్సిలర్, సాలూరు మున్సిపాలిటీ